సాక్షి
శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు
బుధవారం । 28 । ఆగస్టు । 2024



32.866 టీఎంసీలకు సోమశిల

సోమశిల: జలాశయం మంగళవారానికి 32.866 టీఎంసీలకు చేరుకుంది. 13,763 క్యూసెక్కుల వరద వస్తోంది. దక్షిణకాలువకు 2,005, పెన్నార్ డెల్టాకు 200, ఉత్తరకాలువకు 5, కావలి కాలువకు 350 క్యూసెక్కుల విడుదల చేస్తున్నారు.



బంగారం ధరలు

24 క్యారెట్లు (10 గ్రాములు)	రూ.74,030
22 క్యారెట్ల ఆర్నమెంట్ (గ్రా)	రూ.6,702
మూడు శాతం జీఎస్టీతో	రూ.6,903
నవర (8 గ్రాములు)	రూ.55,224

గరిష్టం/కనిష్టం
38.3 /29.0

వాతావరణం

జిల్లాలో బుధవారం పగటి వాతావరణం పొడిగా ఉంటుంది. ఉష్ణోగ్రతలు అధికంగా ఉంటాయి. రాత్రి అక్కడక్కడ ఆకాశం మేఘావృతంగా ఉంటుంది. గాలిలో తేమ 53 శాతం ఉంది.

ఆర్జీకర్ దారుణం పునరావృతం కాకూడదు



కోల్‌కతా ఆర్జీకర్ ఆస్పత్రిలో మహిళా డాక్టర్‌పై జరిగిన హత్యాచారం అత్యంత బాధాకరం. ఇలాంటి ఘటనలు సమాజంలో పునరావృతం కాకుండా చర్యలు చేపట్టాలి. ప్రాణం పోసే డాక్టర్లపై దాడులు జరగడం దారుణం. యావత్భారతావనిని కదిలించింది. సుప్రీం కోర్టు టాస్క్‌ఫోర్సు కమిటీని ఏర్పాటు చేయడం మంచి పరిణామం. డాక్టర్లు, నర్సులు రక్షణ కోసం పూర్తి స్థాయి రక్షణ చర్యలు చేపట్టాలి. ఆర్జీకర్ ఘటనలోని దోషులను కఠినంగా శిక్షించాలి.
– డాక్టర్ పి.ప్రణీత, జూనియర్ డాక్టర్, పెద్దాస్పత్రి

మహిళలను రక్షించుకోవడం అందరి బాధ్యత



సమాజంలోని మహిళలను కాపాడుకోవడం అందరి బాధ్యత. తల్లిదండ్రులు సైతం ఆడైనా.. మగైనా సమాన భావనతో చిన్నతనం నుంచే పెంచాలి. నైతిక విలువలు నేర్పాలి. మహిళ ఉంటేనే పురుషుల మనుగడ ఉంటుందనేది మరిచిపోకూడదు. తప్పు చేసిన వారిపై ప్రభుత్వాలు అత్యంత కఠినంగా వ్యవహరించాలి. ప్రతి ఇంట్లో అమ్మ, చెల్లి, అక్క ఉంటారు. మహిళలను కించపరిచినా, ఇతరత్రా వేధించినా కఠిన శిక్షలు పడేలా ప్రభుత్వాలు నూతన చట్టాలు తేవాలి.
– డాక్టర్ ప్రసాద్, ఆర్థోపెడిక్ స్పెషలిస్ట్, జీజీహెచ్

మహిళా డాక్టర్లకు, నర్సులకు రక్షణ కల్పించాలి



కోల్‌కతా ఆర్జీకర్ ఆస్పత్రిలో యువ వైద్యురాలిపై జరిగిన హత్యాచారం అత్యంత పాశవికమైనది. న్యాయం చేయాలని అక్కడ డాక్టర్లు చేస్తున్న ప్రదర్శనపై అల్లరి మూకలు దాడులు చేయడం మరింత బాధకు గురిచేసింది. కోల్‌కతా వంటి ఘటనలు తరచూ జరుగుతూనే ఉన్నాయి. మహిళా డాక్టర్లతో పాటు నర్సింగ్ స్టాఫ్‌కు రక్షణ కల్పించాలి. వేగంగా దోషులను శిక్షించి డాక్టర్లకు భరోసా కల్పించాలి. దేశవ్యాప్తంగా జూనియర్ వైద్యులు తమ విధులు బహిష్కరించి చేసిన పోరాటం స్ఫూర్తిదాయకం.
– వై.ఉషారాణి, సీనియర్ స్టాఫ్ నర్స్, జీజీహెచ్

న్యూస్‌రీల్

ప్రభుత్వ భూముల మార్కెట్ విలువ తెలియజేయండి

• జేసీ కార్తీక్



మాట్లాడుతున్న జేసీ కార్తీక్

నెల్లూరు(దర్గామిట్ట): జిల్లాలోని ప్రభుత్వ భూముల మార్కెట్ విలువకు సంబంధించి సమగ్ర వివరాలను సేకరించి అందజేయాలని జేసీ కొల్లాబత్తుల కార్తీక్ తెలిపారు. మంగళవారం కలెక్టరేట్‌లోని శంకరన్ సమావేశ మందిరంలో జిల్లా రిజిస్ట్రేషన్ శాఖ అధికారులతో ఆయన సమీక్ష నిర్వహించారు. నెల్లూరు రెవెన్యూ డివిజన్ పరిధిలో ఇప్పటి వరకు భూమి కన్వర్షన్‌కు సంబంధించి వచ్చిన దరఖాస్తులను నివేదించాలన్నారు. నుడా పరిధిలో భూమి కన్వర్షన్లకు సంబంధించి నివేదిక ఇవ్వాలన్నారు. మున్సిపాలిటీలు కార్పొరేషన్ల పరిధిలో గృహ సముదాయంగా ఉన్న వ్యాపార గృహాలకు సంబంధించి సమగ్రంగా నివేదిక రూపొందించాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా రిజిస్ట్రార్ బాలాంజనేయులు, జిల్లా మార్కెట్ విలువ రిజిస్ట్రార్ వర్మ, నగరపాలక సంస్థ డిప్యూటీ కమిషనర్ శర్మద, జెడ్పీ సీఈఓ కన్నమనాయుడు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

ఫోర్జరీ కేసులో కొనసాగుతోన్న విచారణ

నెల్లూరు (క్రైమ్): నెల్లూరు నగరపాలక సంస్థ కమిషనర్ సంతకాల ఫోర్జరీ కేసులో పోలీసు అధికారులు విచారణ వేగవంతం చేశారు. ఇప్పటికే ఈ కేసులో నగరపాలక సంస్థ టీపీఓ దేవేంద్రను అరెస్ట్ చేసిన విషయం విదితమే. మంగళవారం నగర డీఎస్పీ డి. శ్రీనివాసరెడ్డి కార్పొరేషన్ కార్యాలయంలోని టౌన్‌ప్లానింగ్ సెక్షన్, నుడా కార్యాలయాల్లో విచారణ చేపట్టారు. పలు ఫైళ్లను పరిశీలించారు. కీలక ఫైళ్లను స్వాధీనం చేసుకుని తన వెంట తీసుకెళ్లినట్లు సమాచారం.

జిల్లా స్థాయి క్రీడా ప్రతిభా అవార్డులకు ఐదు పాఠశాలల ఎంపిక

నెల్లూరు (టౌన్): జిల్లా స్థాయి క్రీడా ప్రతిభా అవార్డులకు ఐదు పాఠశాలలు ఎంపికయ్యాయి. నగరంలోని కేఎన్నార్ మున్సిపల్ హైస్కూల్ ప్రథమ, కోవూరు మండలం పాటూరు జెడ్పీ హైస్కూల్ ద్వితీయ, నెల్లూరు నగరంలోని బీవీఎస్ మున్సిపల్ హైస్కూల్ తృతీయ, కోవూరులోని జెడ్పీ గరల్స్ హైస్కూల్ నాల్గో, పొదలకూరు మండలం మహమ్మదాపురంలోని జెడ్పీ హైస్కూల్ ఐదో స్థానం దక్కాయి. ఈ నెల 29న జాతీయ క్రీడా దినోత్సవం, హాకీ మాంత్రికుడు ధ్యాన్‌చంద్ జన్మదినం సందర్భంగా ఈ పాఠశాలలకు అవార్డులను అందజేశారు. విద్యార్థులు క్రీడల్లో పాల్గొనే విధంగా హెడ్‌మాస్టర్లు, ఉపాధ్యాయులు ప్రేరణ కల్పించాలని డైరెక్టర్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్ విజయరామరాజు ఉత్తర్వులు జారీ చేశారు. అన్ని పాఠశాలల్లో క్రీడా దినోత్సవాన్ని నిర్వహించాలన్నారు.

వైఎస్సార్‌సీపీ నేత ఖలీల్ అహ్మద్‌కు గుండెపోటు



ఖలీల్ అహ్మద్

నెల్లూరు (బారకాసు/స్టోన్‌హౌస్‌పేట): వైఎస్సార్‌సీపీ నేత, డిప్యూటీ మేయర్ ఖలీల్ అహ్మద్ మంగళవారం ఉదయం గుండెపోటుకు గురయ్యారు. కుటుంబ సభ్యులు హుటాహుటిన నగరంలోని మెడికవర్ హాస్పిటల్‌కు తరలించారు. అక్కడి వైద్యులు ఖలీల్ అహ్మద్‌ను పరీక్షించి గుండెకు సంబంధించిన ప్రధాన రక్తనాళాల్లో ఒకటి బ్లాక్ అయిందని, మిగిలిన నాళాలు మైనర్ బ్లాక్‌లుగా గుర్తించారు. వెంటనే రక్తనాళానికి స్టంట్ వేశారు. ప్రస్తుతం ఖలీల్ అహ్మద్ ఆరోగ్య పరిస్థితి నిలకడగానే ఉంది. ఖలీల్ అహ్మద్ ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో నెల్లూరు సిటీ వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేశారు. సమాచారం తెలుసుకున్న ఎమ్మెల్సీ చంద్రశేఖర్‌రెడ్డి హాస్పిటల్‌కు వెళ్లి ఖలీల్ అహ్మద్‌ను పరామర్శించారు. ఈ విషయం తెలుసుకున్న మాజీ మంత్రి డాక్టర్ పోలుబోయిన అనిల్‌కుమార్‌యాదవ్ ఖలీల్ అహ్మద్ వైద్యానికి అయ్యే ఖర్చు తానే చూసుకుంటానని మెరుగైన వైద్య సేవలు అందించాలని హాస్పిటల్ వైద్యులకు సూచించినట్లు తెలిసింది.

ముడుపులు ముడితే సక్రమమే

నిన్నటి వరకు అక్రమ లేఅవుట్లని ప్రచారం

- నకిలీ డాక్యుమెంట్లతో లేఅవుట్ వేసినట్లు పొదలకూరు పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు
- తాజాగా సక్రమమని సర్టిఫికెట్లు
- జిల్లా వ్యాప్తంగా దాదాపు 270కి పైగా అక్రమ లేఅవుట్లు
- ఇందులో సగం టీడీపీ వారివే
- అనధికార లేఅవుట్లు 117 అని ప్రతికా ప్రకటనలు

జిల్లాలో లేఅవుట్లు పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్నాయి. అయితే ఇందులో 95 శాతం లేఅవుట్లన్నీ అన్ని రకాల అనుమతుల్లేనివే ఉన్నాయి. దాదాపు 270కుపైగా అక్రమ లేఅవుట్లు ఉన్నట్లు ప్రత్యేకాధికారుల బృందం పరిశీలనలో లెక్కలు తేల్చారు. అయితే ఇందులో సగానికి పైగా టీడీపీ, ఆ పార్టీ మద్దతుదారులవే ఉన్నట్లు నిర్ధారించారు. కానీ వైఎస్సార్‌సీపీ నేతలు, ఆ పార్టీ మద్దతుదారులకు సంబంధించిన 117 లేఅవుట్లు అనధికారమని వీటిల్లో ప్లాట్లు కొనొద్దంటూ పత్రికా ప్రకటనలు ఇచ్చారు. అయితే వైఎస్సార్‌సీపీ మద్దతుదారుల లేఅవుట్లకు సంబంధించి పక్కా అనుమతులు ఉన్నప్పటికీ చిన్నచిన్న కారణాలు చూపిస్తూ క్రయవిక్రయాల నిషేధిత జాబితాలో పెట్టారు. టీడీపీ, ఆ పార్టీ మద్దతుదారులకు సంబంధించిన లేఅవుట్లు అయితే వ్యవసాయ భూములను కమర్షియల్ ల్యాండ్‌గా కన్వర్షన్ చేయనవి, నుడా అప్రూవల్ కానివే అత్యధికంగా ఉన్నట్లు తెలుస్తోంది.



నెల్లూరులోని హైవేకు కూతవేటు దూరంలో లేఅవుట్

సాక్షి ప్రతినిధి, నెల్లూరు: నగరీకరణ జరుగుతున్న క్రమంలో శివారు ప్రాంతాలు, నగరానికి అతి చేరువగా ఉన్న గ్రామీణ ప్రాంతాల్లోని పొలాలన్నీ ఇప్పుడు లేఅవుట్లుగా అవతరిస్తున్నాయి. అన్ని అనుమతులతో లేఅవుట్లు వేయడం ఖరీదుగా మారింది. మొదటగా వ్యవసాయ భూములను కమర్షియల్ ల్యాండ్‌గా కన్వర్షన్ చేయడానికి, ఆ తర్వాత డెవలప్‌మెంట్‌లో భాగంగా భూమి మెరక చేయడం, ప్లాట్లు విభజించి రోడ్లు, ఇతర వసతులు కల్పనకు భారీ మొత్తంలోనే ఖర్చు చేయాల్సి ఉంటుంది. దీని తర్వాతనే నుడా అనుమతులకు మరికొంత ఖర్చులు ఉంటాయి. ఈ ప్రక్రియలు చేసినా.. చేయకపోయినా సంబంధిత శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులకు ముడుపులు ముట్టజెప్పక తప్పని పరిస్థితి. ఈ ఖర్చులకు బయపడిన లేఅవుట్ల యజయానులు ప్లాట్లు వేసి విక్రయించుకుంటే కొనుగోలుదారులే క్రమబద్ధీకరణ కష్టాలు పడతారని ఇలా విచ్చలవిడిగా అనధికార లేఅవుట్లు వేస్తున్నారు.



పోతిరెడ్డిపాళెంలోని అనుమతులు లేని లేఅవుట్

➡ కోవూరు మండలం పోతిరెడ్డిపాళెం పరిధిలోని గంగవరం గీతాంజలి కళాశాలకు వెళ్లే దారిలో నెల్లూరు– ముంబయి జాతీయ రహదారి పక్కనే జేఆర్ లేఅవుట్‌ను అనుమతులు లేకుండానే ఏర్పాటు చేశారు. అనుమతుల విషయం అడిగితే అన్నీ ఉన్నాయని చెప్పి విక్రయిస్తున్నారు. కానీ ఈ లేఅవుట్లకు ఎటువంటి అనుమతులు లేవని గ్రామపంచాయతీ అధికారులు చెబుతున్నారు.

నిన్న అక్రమం.. నేడు సక్రమం

సర్వేపల్లి నియోజకవర్గం పొదలకూరు పట్టణంలో ఉన్న లేఅవుట్‌పై ఇటీవల పెద్ద ఎత్తున వివాదాలు చోటు చేసుకున్నాయి. పొదలకూరులోని స్వర్ణ గార్డెన్స్‌కు నుడా అనుమతులు లేవు. అసలు డాక్యుమెంట్లే నకిలీవని అధికారులు నిగ్గుతేల్చారు. ల్యాండ్ కన్వర్షన్ ఫేక్ డాక్యుమెంట్లని నుడా అధికారులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. భూ యజమానులపై కేసులు నమోదు చేశారు. క్రయవిక్రయాలు నిలిపివేశారు. అయితే స్థానిక ప్రజాప్రతినిధికి కప్పం కట్టడంతో ఆ లేఅవుట్‌కు అనుమతులు వచ్చాయి. ముడుపులు ముట్టగానే అక్రమం సక్రమం అయిందా?.. డాక్యుమెంట్లే ఫేక్ అయితే నుడా అధికారులు అనుమతులు ఎలా వచ్చాయంటూ స్థానికంగా పెద్ద ఎత్తున చర్చ జరుగుతోంది.

➡ నెల్లూరు మార్గంలో ఉన్న కేఆర్ఆర్ లేఅవుట్ పరిస్థితి కూడా ఇలాగే ఉంది. వాగు, వంక, ప్రభుత్వ భూములు ఆక్రమించి లేఅవుట్ వేశారని ఆర్అండ్‌బీ, ఇరిగేషన్ అధికారులు హడావుడి చేసి నిర్మాణాలను తొలగించారు. అయితే కొద్ది రోజులకే ఆ లేఅవుట్ వైపు కన్నెత్తి కూడా అధికారులు చూడడం లేదు. నియోజకవర్గంలో పదేళ్లలో 87 లేఅవుట్లను ఏర్పాటు చేశారు. అన్నీ ప్రధాన రాజకీయ పార్టీలకు చెందిన వారేవే. వీటిలో దాదాపు 58 లేఅవుట్లకు అనుమతులు లేవు. ఒక్క పొదలకూరు మండలంలోనే 45 లేఅవుట్లకు అనుమతుల్లేవని అధికారులు నిగ్గు తేల్చారు. మనుబోలు మండలంలో దశాబ్ద కాలం నుంచి 12 లేఅవుట్లు ఏర్పాటు చేస్తే వీటిలో అధిక భాగం హైవేకు ఆనుకుని నిర్మించారు. వీటికి అనుమతులు లేవని అధికారులు తేల్చారు.

పుట్టగొడుగుల్లా లేఅవుట్లు

నెల్లూరు రూరల్ నియోజకవర్గంలో లేఅవుట్‌లు పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్నాయి. నగర, రూరల్ నియోజకవర్గంలో అధికారిక లేఅవుట్లు 35 ఉంటే.. అనధికారిక లేఅవుట్లు 130 ఉన్నట్లు ప్రాథమిక అంచనా. టీడీపీ నేతలు నిబంధనలకు విరుద్ధంగా లేఅవుట్లను ఏర్పాటు చేసి విక్రయాలు చేస్తున్నారు. రోజురోజుకు రూరల్ పరిసరాలు అభివృద్ధి దిశగా అడుగులు పడుతుండడంతో ఎక్కువ మంది లేఅవుట్లలో ప్లాట్లు కొనుగోలు చేసేందుకు ఆసక్తి చూపుతున్నారు. యజమానులు నిబంధనలకు విరుద్ధంగా ఎకరా, రెండు ఎకరాల్లో కూడా లేఅవుట్లు వేసి క్రయవిక్రయాలు చేస్తున్నారు. నుడా నిబంధనల ప్రకారం 40 అడుగులు రోడ్లు, కాలువలు, సీసీరోడ్లు, వీధిలైట్లు, పైప్‌లైన్లు ఏర్పాటు చేయాల్సి ఉంది. ఈ నిబంధనల ప్రకారం లేఅవుట్లు నిర్మిస్తే ఆదాయం ఉండదన్న కారణంతో అనధికారిక లేఅవుట్లు పుట్టుకొస్తున్నాయి.

హైవేకు కూతవేటు దూరంలో..

నగరంలోని దెయ్యాలదిబ్బకు సమీపంలో హైవేకు కూతవేటు దూరంలో మూడు ఎకరాల్లో లేఅవుట్‌ను ఇటీవల నిర్మించారు. దాదాపు 30 ప్లాట్లు ఏర్పాటు చేశారు. ఈ లేఅవుట్ ఏర్పాటుకు నుడా అనుమతులు కూడా తీసుకోకపోవడం గమనార్హం. అయినా ఇవి అధికారిక లేఅవుట్‌గా యజమానులు ప్లాట్లు కొనుగోలుదారులకు విక్రయించినట్లు సమాచారం.

కన్వర్షన్ లేకుండానే.. లేఅవుట్లు

కోవూరు పరిసరాల్లో వ్యవసాయ భూములను కన్వర్షన్ లేకుండానే లేఅవుట్లుగా ఏర్పాటు చేశారు. పడుగుపాడులోని జాతీయ రహదారికి పక్కనే ఉన్న భూములు కావడంతో ప్లాట్లు వేసి విక్రయిస్తే.. మంచి ధరలు లభిస్తాయని కొందరు చకచకా లేఅవుట్లు వేసేశారు. కొనుగోలుదారులకు పక్కాగా ఆ భూమికి సంబంధించి లీగల్ హైర్ డాక్యుమెంట్లు చూపించి విక్రయాలు సాగిస్తున్నారు. లేఅవుట్లకు అనుమతులు లేకపోవడంతో ఇల్లుకట్టుకోవాలంటే.. ల్యాండ్ కన్వర్షన్ చార్జీలు, నుడా అనుమతులు తీసుకోవాల్సి వస్తోంది.

కందుకూరులో అక్రమ వెంచర్లు

కందుకూరులో సుమారు 16 లేఅవుట్లు ఉంటే.. ఇందులో రెండు మినహా మిగతా వాటికి అనుమతుల్లేవు. వెంచర్లు వేసే వాళ్లు టీడీపీ అనుకూలమైతే ఏ అనుమతులు అక్కర్లేదు. లేఅవుట్లు వేసిన వాళ్లు తమను కలవాలని ఇప్పటికే కూటమి ప్రజాప్రతినిధి సమాచారం పంపించారు. తాము అనుమతి ఇస్తేనే వాటిల్లో క్రయవిక్రయాలు చేపట్టమని, లేదంటే ఆపేయాలని అధికారులకు ఆదేశాలు జారీ చేసినట్లు సమాచారం. గతంలో లేఅవుట్లు వేసి విక్రయాలు పూర్తయిన వాటికి సంబంధించి కూడా ఇప్పుడు అనుమతుల్లేవని నోటీసులు ఇవ్వాలని అధికారులపై ఒత్తిడి చేస్తున్న పరిస్థితి కనిపిస్తోంది. ఇటీవల కనిగిరి రోడ్డులో వేసిన వెంచర్లకు ల్యాండ్ కన్వర్షన్ ప్రక్రియే చేపట్టలేదు. ఇటు అధికారులకు, అటు టీడీపీ నాయకులకు డబ్బులు ముట్ట చెప్పలేక రియల్టర్లు తలలు పట్టుకుంటున్నారు.



పడుగుపాడులో పంట కాలువను పూడ్చి యథేచ్ఛగా రోడ్డు వేస్తున్న దృశ్యం

➡ పడుగుపాడులో పంట కాలువను పూడ్చి లేఅవుట్‌కు రోడ్డు వేశారు. లేఅవుట్‌కు ఎటువంటి అనుమతులు లేకపోయినప్పటికీ పంట కాలువ పూడ్చి రాజమార్గం ఏర్పాటు చేసుకున్నారు. ఎప్పుడైనా రెండు రోజులు భారీ వర్షాలు పడితే ఆ వర్షపు నీరు మొత్తం ఈ లేఅవుట్లో పడి పూర్తిగా మునిగిపోయే ప్రమాదం ఉంది. అటు నుడా కానీ, ఇటు పంచాయతీ అధికారులు కానీ లేఅవుట్ నిర్మాణాన్ని ప్రశ్నించిన పాపాన పోలేదు. ఇక పంట కాలువ పూడ్చితే ఇరిగేషన్ అధికారులు కూడా కన్నెత్తి చూడడం లేదు.



వింజమూరులోని భట్టువారిపాళెం రోడ్డులో నిబంధనలకు విరుద్ధంగా వేసిన ప్లాట్లు

60 వరకు అనధికార లేఅవుట్లు

ఉదయగిరి నియోజకవర్గంలో కలిగిరి, వింజమూరు, దుత్తలూరు, ఉదయగిరి, సీతారామపురం మండలాలను కలుపుతూ జాతీయ రహదారుల నిర్మాణాలు కొనసాగుతున్న నేపథ్యంలో భూముల ధరలకు రెక్కలొచ్చాయి. దీంతో కొంత మంది వ్యవసాయ భూములను నిబంధనలకు విరుద్ధంగా లేఅవుట్లు వేసి అమ్మకాలు సాగిస్తున్నారు. వింజమూరు, ఉదయగిరి మండల కేంద్రాల్లో అసైన్‌మెంట్ భూముల్లో లేఅవుట్లు వేసి విక్రయిస్తూ కొనుగోలుదారులను నిలువునా ముంచుతున్నారు. కొనుగోలుదారులకు ఏది పట్టా భూమి, ఏది అసైన్‌మెంట్ భూమి తెలియక కొనుగోలు చేసి తర్వాత ఇబ్బంది పడుతున్నారు. ఉదయగిరి నియోజకవర్గంలో సుమారు 60 వరకు లేఅవుట్లు ఉన్నట్లు తెలుస్తోంది. ఈ లేఅవుట్లలో దాదాపు 500 ఎకరాల్లో ప్లాట్లు వేశారు. వీటిలో ఐదారు లేఅవుట్లకు మాత్రమే నిబంధనల మేరకు అనుమతులున్నాయి. మిగతావన్నీ కూడా అక్రమ లేఅవుట్లుగానే అధికారులు గుర్తించినప్పటికీ ఎటువంటి చర్యలు తీసుకోలేదు. వింజమూరు–చాకలికొండ రోడ్డు మార్గంలో అసైన్‌మెంట్ భూమిని ప్లాట్లుగా విభజించి సెటిల్‌మెంట్ పట్టా భూమి నంబర్లు వేసి రిజిస్టర్ చేస్తున్నట్లు ఆరోపణలున్నాయి. దుత్తలూరు, ఉదయగిరి మండల కేంద్రాల్లో కొన్ని లేఅవుట్లలో ఇదే పరిస్థితి కొనసాగుతోంది.

ఆగని ఇసుక దోపిడీ

రెండు రోజుల్లో 4 వేల మెట్రిక్ టన్నుల ఇసుక గల్లంతు!

- మర్రిపాడు యార్డులో ఇసుక నిల్వలపై పొంతన లేని ప్రకటనలు
- 36 వేల మెట్రిక్ టన్నులున్నట్లు ఈ నెల 22న కలెక్టర్ ప్రెస్‌మీట్లో వెల్లడి
- 30 వేల మెట్రిక్ టన్నులున్నట్లు మైనింగ్ డీడీ ఈ నెల 24న ప్రకటన
- ఇసుక నిల్వలపై మతలబు ఏమిటి?



మర్రిపాడు ఇసుక యార్డులో వెనుక వైపు నుంచి అక్రమంగా జరుగుతున్న లోడింగ్

సాక్షి ప్రతినిధి, నెల్లూరు: జిల్లాలోని మర్రిపాడు ఇసుక డిపోలో కొద్ది రోజులుగా ఇసుక గోల్‌మాల్ జరుగుతోంది. సార్వత్రిక ఎన్నికల ముందు నాటికి యార్డులో సుమారు 5 లక్షల మెట్రిక్ టన్నుల ఇసుక నిల్వలు ఉన్నాయి. కౌంటింగ్ జరిగిన మరుసటి రోజు నుంచే టీడీపీ నేతలు ఇసుక మాఫియాగా తయారై ఈ డంప్‌ను కొల్లగొట్టేశారు. ఇక అడుగున మిగిలిన ఇసుకను నిల్వగా చూపించి అధికారికంగా విక్రయాలు ప్రారంభించారు. అయితే మర్రిపాడు డిపోలో నిల్వ చేసిన ఇసుకను ఈ మాఫియా ఇప్పటికీ దోచుకుంటున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఒక పక్క పర్మిట్ తీసుకున్న వాహనాలకు లోడింగ్ జరుగుతుంటే.. మరో పక్క నుంచి ఈ ఇసుక మాఫియా తమ వాహనాలకు లోడింగ్ చేసి పంపిస్తున్నట్లు తెలుస్తోంది. ఈ వాహనాలకు సంబంధించి ఒక పర్మిట్ తీసుకుని అదే పర్మిట్‌తో రోజుకు పదుల సంఖ్యలో టిప్పర్ల ద్వారా ఇసుక అక్రమ రవాణా చేస్తున్నట్లు సమాచారం. రెండు రోజుల వ్యవధిలో కలెక్టర్ ఆనంద్, మైనింగ్ డీడీ శ్రీనివాసరావు మర్రిపాడు డిపోలో ఇసుక నిల్వలపై చెప్పిన గణాంకాలను బట్టి ఇసుక అక్రమ రవాణా ఏ స్థాయిలో జరుగుతోందో స్పష్టమవుతోంది.

కలెక్టర్.. మైనింగ్ డీడీ ప్రకటనల్లో ఇంత తేడానా?

మర్రిపాడు ఇసుక డిపోలో ఇసుక నిల్వలపై రెండు రోజుల వ్యవధిలో కలెక్టర్ ఆనంద్, మైనింగ్ డీడీ శ్రీనివాసరావు చేసిన ప్రకటనల్లో 4 వేల మెట్రిక్ టన్నుల తేడాలు కనిపిస్తున్నాయి. కలెక్టర్ ఆనంద్ మీడియా సాక్షిగా రోజు వారీగా వెయ్యి టన్నులు ఇసుక సరఫరా ఇస్తున్నామని, అంతా పారదర్శకంగా ఉందని చెప్పారు. రెండు రోజుల వ్యవధిలోనే మైనింగ్ డీడీ మాత్రం ఇసుక నిల్వ 30 వేల టన్నులు మాత్రమే ఉందని చెప్పారు. కలెక్టర్ చెప్పిన ప్రకారమే రోజుకు వెయ్యి టన్నులు సరఫరా చేసినా రెండు రోజుల్లో 2 వేల మెట్రిక్ టన్నుల ఇసుక సరఫరా చేసినా ఇంకా 34 వేల మెట్రిక్ టన్నుల ఇసుక నిల్వ ఉండాలి. అయితే మైనింగ్ డీడీ ప్రకటనలో 30 వేల మెట్రిక్ టన్నులు మాత్రమే ఉందని చెప్పడం, ఇద్దరు ఉన్నతాధికారుల ప్రకటనలు పొంతన లేకపోవడంపై పలు అనుమానాలకు తావిస్తోంది. రెండు రోజుల్లోనే 4 వేల మెట్రిక్ టన్నుల ఇసుక ఏమైనట్లు? అనేది మిలియన్ డాలర్ల ప్రశ్నగా మిగిలింది. మర్రిపాడు ఇసుక నిల్వ కేంద్రంలో ఇసుక మాఫియా తిష్టవేసి బిల్లులు లేకుండానే ఇసుక తరలిస్తున్నారనే ఆరోపణలు మొదటి నుంచి వస్తున్నాయి. మాఫియా మరో వైపు నుంచి జేసీబీ పెట్టి వారి వాహనాలకు ఇసుక లోడింగ్ చేస్తూ ఇతర జిల్లాలకు తరలిస్తున్నారన్న ఆరోపణల నేపథ్యంలో జిల్లా అధికారుల పొంతన లేని ప్రకటనలు చూస్తే నిజమేననిపిస్తోంది. ఇసుక అక్రమ రవాణా జరుగుతుండడంతో ఎక్కడ లెక్కల బొక్కలు బయటపడుతాయోనని అప్రమత్తమైన అధికారులు శనివారం, సోమవారం మైనింగ్ ఏడీ శ్రీనివాసరావు మర్రిపాడు ఇసుక డిపోలో నిల్వలపై అధికారిక ప్రకటన జారీ చేయడం కూడా అనుమానాలకు తావిస్తోంది. అయినప్పటికీ ఇసుక అక్రమ రవాణా జరుగుతున్నట్లు సమాచారం. రెండు రోజుల్లో గల్లంతయిన ఇసుక అక్రమాలపై జిల్లా అధికారులే నిగ్గు తేల్చాల్సిన అవసరం ఉంది.

కలెక్టర్ ఏం చెప్పారు..

'ప్రస్తుతం జిల్లాలోని మర్రిపాడు ఇసుక డిపోలో 36 వేల మెట్రిక్ టన్నుల ఇసుక అందుబాటులో ఉంది. ఇక్కడి నుంచి రోజుకు వెయ్యి టన్నుల ఇసుక సరఫరా అవుతుంది. ఇసుక పాయింట్ దూరంగా ఉండడంతో రవాణా ఖర్చులు ఎక్కువ అవుతుందని ప్రజల నుంచి ఫిర్యాదులు వస్తున్నాయి. డిప్యూటీ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్ ద్వారా ఇసుక (సీలింగ్ రేటు) రవాణా చార్జీలను ఫిక్స్ చేయడం జరిగింది'

➡ ఈ నెల 22న కలెక్టర్ ఆనంద్ ఎస్పీ కృష్ణకాంత్‌తో కలిసి కలెక్టరేట్‌లో విలేకరుల సమావేశంలో వెల్లడించారు.

మైనింగ్ డీడీ ఏం ప్రకటించారు..

'మర్రిపాడు ఇసుక నిల్వ కేంద్రంలో శనివారం 106 బుకింగ్ ఆర్డర్లు వచ్చాయి. నిల్వ కేంద్రంలో ఆయా బుకింగ్ ఆర్డర్లకు 1,022.5 మెట్రిక్ టన్నులు సరఫరా చేయగా ఇంకా 30,441 మెట్రిక్ టన్నుల ఇసుక నిల్వ ఉందని జిల్లా గనులు భూగర్భ శాఖ డిప్యూటీ డైరెక్టర్ శ్రీనివాసులు ఒక ప్రకటనలో పేర్కొన్నారు'

➡ ఈ నెల 24న మైనింగ్ డీడీ సమాచార పౌర సంబంధాలశాఖ డీడీ ద్వారా విడుదల చేసిన ప్రకటనలో వెల్లడించారు. సోమవారం విడుదల చేసిన ప్రకటనలో కూడా వెయ్యి టన్నులు విక్రయించామని పేర్కొన్నారు.



మర్రిపాడు ఇసుక యార్డులో అధికారికంగా ఇసుక లోడింగ్ చేసే ముందు వైపు

ఇఫ్కో కిసాన్‌సెజ్‌లో పరిశ్రమల ఏర్పాటుకు చర్యలు

• అధికారులకు కలెక్టర్ ఆనంద్ ఆదేశం



కొడవలూరు: ఇఫ్కో కిసాన్ సెజ్‌లో పరిశ్రమల ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఒ.ఆనంద్ అధికారులను ఆదేశించారు. మండలంలోని రాచర్లపాడు ఇఫ్కో కిసాన్ సెజ్, చంద్రశేఖరపురం ఏపీఐఐసీ భూములను మంగళవారం ఆయన పరిశీలించారు. అనంతరం ఇఫ్కో కిసాన్ సెజ్ కార్యాలయంలో సంబంధిత అధికారులతో ఆయన సమావేశమయ్యారు. సెజ్ సీఈఓ టి.సుధాకర్ సెజ్ భూముల్లో పరిశ్రమల ఏర్పాటు, భూముల వివరాలు, అనుమతులు, నీటి అవసరాలపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా కలెక్టర్‌కు వివరించారు. కలెక్టర్ మాట్లాడుతూ సెజ్ భూముల్లో పెద్ద కంపెనీలు ముందుకొచ్చి పరిశ్రమలను ఏర్పాటు చేయాలని ప్రధానంగా వ్యవసాయ ఆధారిత, ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లకు ప్రాధాన్యతనివ్వాలన్నారు. సెజ్ భూముల్లో ఉపాధి హామీ ద్వారా చేపట్టాల్సిన పనులుంటే వెంటనే మంజూరు చేస్తామన్నారు. చంద్రశేఖరపురంలో 'మిథానీ'కి కేటాయించిన భూముల్లో నీటి సమస్యను పరిష్కరించాలని ఏపీఐఐసీ అధికారులకు సూచించారు. మాస్టర్ ప్లాన్లు మార్పులు చేయాలంటే నుడాకు దరఖాస్తు చేయాలని సూచించారు. మార్పులు ప్రతిపాదిత మాస్టర్ ప్లాన్‌కు త్వరగా అనుమతులు మంజూరు చేయాలని నుడా వీసీకి సూచించారు. ఈ సమావేశంలో ఆర్డీఓ శీనానాయక్, ఏపీఐఐసీ డిప్యూటీ జెడ్‌ఎం సురేష్, ఇఫ్కో సీఈఓ టి.సుధాకర్, సీఎఫ్ఓ పాండే, అనిల్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

ప్రాణాలు కాపాడే డాక్టర్లకే రక్షణ కరువైతే ఎలా..?



నిరంతరం వైద్యసేవలందించి ప్రాణాలు కాపాడే డాక్టర్లకే ప్రాణరక్షణ కరువైతే విధులను ఎలా నిర్వర్తించాలి. కోల్‌కతా ఘటనలో అత్యంత పాశవికంగా వ్యవహరించిన వారిని కఠినంగా శిక్షిస్తే రక్షణపై వైద్యుల్లో నమ్మకం పెరుగుతుంది. ఇలాంటి చర్యలకు పాల్పడాలంటేనే భయపడేలా శిక్షలుండాలి. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు చేపట్టాలి.

– బాలచంద్రబాబు, కొడవలూరు పీహెచ్‌సీ వైద్యాధికారి

పూర్తి స్థాయిలో రక్షణ చర్యలు చేపట్టాలి



వైద్యులకు నిర్ణీత పనివేళలుండవు. అత్యవసరమైతే ఏ సమయంలోనైనా వైద్యసేవలందించాలి. కోల్‌కతా ఘటనతో రాత్రి వేళ అత్యవసర కేసులకు హాజరుకావాలంటేనే మహిళా వైద్యులు భయపడుతున్నారు. పూర్తి స్థాయిలో రక్షణ కల్పించేలా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు చేపట్టాలి. గ్రామీణ ప్రాంతాల్లో పనిచేసే మహిళా డాక్టర్ల రక్షణకు తగు చర్యలు చేపట్టాలి

– రామకృష్ణ, వైద్యాధికారి, కొడవలూరు పీహెచ్‌సీ

మహిళా డాక్టర్ల రక్షణ బాధ్యత ప్రభుత్వాలదే



విధులు నిర్వర్తించే మహిళా డాక్టర్ల రక్షణ బాధ్యత ప్రభుత్వాలదే. నిరంతరం వైద్యసేవలను అందించి అలసిపోతున్న డాక్టర్లకు వసతులు కల్పించాలి. రోగులు, వారి బంధువుల నుంచి రక్షణ కల్పించాలి. ప్రభుత్వ వైద్యశాలల్లో మహిళా డాక్టర్లపై దాడులను అరికట్టేందుకు చర్యలు చేపట్టాలి. అలా కాని పక్షంలో డాక్టర్లు విధులు నిర్వర్తించడం కష్టంగా మారుతుంది.

– స్రవంతి, మహ్మదాపురం పీహెచ్‌సీ, పొదలకూరు మండలం



క్లుప్తంగా

ఖోఖో జట్టుకు బాలికల ఎంపిక

గుడ్లూరు (కందుకూరు రూరల్): ఉమ్మడి ప్రకాశం జిల్లా ఖోఖో జట్టుకు గుడ్లూరు మండలంలోని మొగళ్లూరు కస్తూర్బా గాంధీ విద్యాలయానికి చెందిన ముగ్గురు బాలికలు ఎంపికయ్యారని ప్రిన్సిపల్ అమృతజ్యోత్స్న, పీఈటీ చిట్టెమ్మ తెలిపారు. ఈ మేరకు మంగళవారం వారు మాట్లాడారు. జే పంగులూరులో నిర్వహించిన సబ్ జూనియర్స్ ఖోఖో జిల్లా జట్ల ఎంపికల్లో మనశ్రీ, శ్రీలక్ష్మి, నిర్మల ఉత్తమ ప్రతిభ చూపి ఎంపికయ్యారని వివరించారు. జే పంగులూరులో వచ్చే నెల 20 నుంచి 22 వరకు నిర్వహించనున్న రాష్ట్ర స్థాయి పోటీల్లో వీరు పాల్గొననున్నారని చెప్పారు.

ఉత్సాహంగా క్రీడా పోటీలు




నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట): జాతీయ క్రీడా దినోత్సవాన్ని పురస్కరించుకొని నగరంలోని ఏసీ సుబ్బారెడ్డి స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో వివిధ క్రీడా పోటీలను మంగళవారం నిర్వహించారు. వాలీబాల్, ఫుట్‌బాల్, బాస్కెట్‌బాల్, ఖోఖో, బ్యాడ్మింటన్, చెస్, యోగా, లెమన్ అండ్ స్పూన్ రేస్, రోప్ జంప్ తదితరాల్లో క్రీడాకారులు ఉత్సాహంగా పాల్గొన్నారు. డీఎస్డీఓ యతిరాజ్, సెట్నెల్ సీఈఓ వెంకటయ్య పర్యవేక్షించారు.

పోస్టుల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

నెల్లూరు(లీగల్): లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ సిస్టమ్ (ఎల్‌ఏడీసీఎస్) విభాగంలో పలు పోస్టుల్లో కాంట్రాక్ట్ ప్రాతిపదికన పనిచేసేందుకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నారు. ఈ మేరకు జిల్లా న్యాయసేవాధికార సంస్థ మంగళవారం ఒక ప్రకటనను విడుదల చేసింది. ఆఫీస్ అసిస్టెంట్, రిసెప్షనిస్ట్ కమ్ టైపిస్ట్ పోస్టులున్నాయని పేర్కొన్నారు. ఆఫీస్ అసిస్టెంట్, టైపిస్ట్‌కు నెలకు రూ.18,500 చొప్పున జీతం ఉంటుందన్నారు. టైపిస్ట్ పోస్ట్‌కు ఆంగ్లంలో టైప్ రైటింగ్ హయ్యర్ గ్రేడ్ ఉత్తీర్ణత, 40 ఏళ్ల వయస్సు, ఏదైనా గ్రాడ్యుయేషన్ పూర్తి చేసి, కంప్యూటర్ పరిజ్ఞానం కలిగిన వారు అర్హులని చెప్పారు. రిసెప్షనిస్ట్ పోస్ట్‌కు ఏదైనా గ్రాడ్యుయేషన్ పూర్తి చేసి ఆంగ్లంలో టైప్ రైటింగ్ ఉత్తీర్ణత కలిగి ఉండాలని తెలిపారు. గరిష్ట వయో పరిమితి 42 ఏళ్లని, వెనుకబడిన తరగతుల వారికి సడలింపు ఉంటుందన్నారు. ఆసక్తి గల వారు తమ దరఖాస్తులను చైర్మన్, జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయసేవాధికార సంస్థ, నెల్లూరుకు ఈ నెలాఖరులోపు పంపాలని కోరారు.

అడల్ట్ బీసీజీపై అపోహలొద్దు



వ్యాక్సినేషన్ ప్రక్రియను పరిశీలిస్తున్న ఖాదర్‌వలీ

కొడవలూరు: అడల్ట్ బీసీజీ వ్యాక్సిన్‌పై కొందరిలో అపోహలున్నాయని, వీటిని తొలగించాలని ఏడీఎంహెచ్‌ఓ ఖాదర్‌వలీ సూచించారు. మండలంలోని యల్లాయపాళెంలో గల అరుంధతీయవాడలో బీసీజీ వ్యాక్సినేషన్ ప్రక్రియను మంగళవారం పరిశీలించిన అనంతరం ఆయన మాట్లాడారు. ఈ వ్యాక్సిన్‌తో దుష్ప్రభావాలున్నాయనే అపోహలు కొందరిలో ఉన్నాయని, వీటిని తొలగించి ఎక్కువ మంది వ్యాక్సిన్‌ను వేయించుకునేలా చూడాలని కోరారు. అనంతరం యల్లాయపాళెం పీహెచ్‌సీలో రికార్డులను పరిశీలించారు. పీహెచ్‌సీ వైద్యాధికారులు కావ్య, జనార్దన్, పీహెచ్‌ఎన్ విజయ, ఏఎన్‌ఎంలు మహేశ్వరి, సుకన్య, హెచ్‌ఎస్ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

గాయపడిన వ్యక్తి మృతి

దుత్తలూరు: హత్యాయత్నానికి గురైన ఘటనలో గాయపడిన వ్యక్తి మరణించారు. వివరాలు.. మండలంలోని నర్రవాడలో సోమవారం రాత్రి ఆరుబయట మంచంపై నిద్రిస్తున్న వల్లెం విశ్వనాథరెడ్డి (30)పై అదే గ్రామానికి చెందిన మతిస్థిమితం లేని పులివర్తి నాగేశ్వరరావు రోకలిబండతో తలపై దాడి చేయడంతో తీవ్రంగా గాయపడిన విషయం విదితమే. క్షతగాత్రుడ్ని ఉదయగిరికి తరలించి, అనంతరం మెరుగైన వైద్యం నిమిత్తం నెల్లూరుకు తరలిస్తుండగా, మార్గమధ్యలో మృతి చెందారు. మృతదేహానికి శవపంచనామా అనంతరం బంధువులకు మంగళవారం అప్పగించారు. సమాచారం అందుకున్న కావలి డీఎస్పీ వెంకటరమణ, ఉదయగిరి సీఐ గిరిబాబు, దుత్తలూరు ఎస్సై ఆదిలక్ష్మి గ్రామానికి చేరుకొని ఘటనపై స్థానికులను అడిగి వివరాలు తెలుసుకున్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

జైల్లో పరిచయమై.. ఆపై ముఠాగా ఏర్పడి

- చోరీ కేసులకు సంబంధించిన ఆరుగురి అరెస్ట్
- రూ.13.47 లక్షల సొత్తు స్వాధీనం



వివరాలను వెల్లడిస్తున్న ఎస్పీ కృష్ణకాంత్

నెల్లూరు(క్రైమ్): జైల్లో ముగ్గురికి పరిచయాలు ఏర్పడ్డాయి.. బయటకొచ్చాక వీరు స్నేహితులతో కలిసి ముఠాగా ఏర్పడ్డారు. ఇలా నగరంలో దొంగతనాలకు పాల్పడుతూ పోలీసుల కళ్లుగప్పి తిరుగుతున్న ఆరుగురు సభ్యుల ఖతర్నాక్ ముఠాను పోలీసులు అరెస్ట్ చేసి, వీరి నుంచి రూ 13.47 లక్షల విలువజేసే సొత్తును స్వాధీనం చేసుకున్నారు. నగరంలోని ఉమేష్‌చంద్ర కాన్ఫరెన్స్ హాల్లో నిందితుల వివరాలను ఎస్పీ కృష్ణకాంత్ మంగళవారం వెల్లడించారు. నగరంలోని ఉస్మాన్‌సాహెబ్‌పేటకు చెందిన హరికృష్ణకు అమలాపురానికి చెందిన ఓ మహిళతో సోషల్ మీడియాలో పరిచయమైంది. ఆమెను హత్య చేసిన ఘటనలో రాజమహేంద్రవరంలోని కేంద్ర కారాగారంలో ఉన్న సమయంలో అక్కడే ఉన్న కాకినాడకు చెందిన కేడీ షీటర్ ప్రసాద్ అలియాస్ దుర్గాప్రసాద్, తూర్పుగోదావరి జిల్లా తాళ్లరేవు మండలం గాడిమొగకు చెందిన సత్యనారాయణతో పరిచయమైంది. జైలు నుంచి బయటకొచ్చిన హరికృష్ణ కోర్టులో వాయిదాకు వెళ్లిన సమయంలో వీరు తారసపడ్డారు. నెల్లూరులో దొంగతనాలు చేసి సమానంగా పంచుకుందామని హరికృష్ణ సూచించడంతో, వారు అంగీకరించారు. అనంతరం నెల్లూరు చేరుకొని పాత నేరస్తులతో చేసుకున్న ఒప్పందాన్ని తన స్నేహితులైన ఉస్మాన్‌సాహెబ్‌పేటకు చెందిన శ్రీహరి, శ్రీనివాసాగ్రహారానికి చెందిన లక్ష్మయ్యకు తెలియజేశారు. ఇదే విషయాన్ని ప్రసాద్, సత్యనారాయణ.. తూర్పుగోదావరి జిల్లా తాళ్లరేవు మండలానికి చెందిన పాత నేరస్తుడు శ్రీనివాస్‌కు తెలియజేశారు. వీరందరూ ముఠాగా ఏర్పడి నగరంలోని వేదాయపాళెం, బాలాజీనగర్, నవాబుపేట, నెల్లూరు రూరల్ పోలీస్‌స్టేషన్ల పరిధిలో ఎనిమిది నెలలుగా ఇంటి దొంగతనాలకు పాల్పడుతూ పోలీసుల కళ్లుగప్పి తిరగసాగారు.

చోరీ సొత్తు విక్రయించేందుకు వెళ్తూ చిక్కి..

ఎస్పీ ఆదేశాల మేరకు నగర డీఎస్పీ శ్రీనివాసరెడ్డి, వేదాయపాళెం ఇన్‌స్పెక్టర్ కిశోర్‌కుమార్ నేతృత్వంలో పోలీసులతో ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి సాంకేతికత ఆధారంగా నిందితులను గుర్తించారు. గొలగమూడి క్రాస్‌రోడ్డు వద్ద వాహన తనిఖీలను ప్రత్యేక బృందం నిర్వహిస్తుండగా, నిందితులు రెండు బైక్‌లపై చోరీ సొత్తును తీసుకెళ్తుండగా, అదుపులోకి తీసుకున్నారు. అనంతరం వారిని తమదైన శైలిలో విచారించగా, వేదాయపాళెం పోలీస్‌స్టేషన్ పరిధిలో నాలుగు, నవాబుపేటలో ఒకటి, బాలాజీనగర్ పరిధిలో మూడు, నెల్లూరు రూరల్ పరిధిలో దొంగతనాలు చేశామని అంగీకరించారు. దీంతో వీరిని అరెస్ట్ చేసి రూ.13,47,500 విలువజేసే 372 గ్రాముల బంగారు ఆభరణాలు, 400 గ్రాముల వెండి వస్తువులు, రెండు బైక్‌లను స్వాధీనం చేసుకున్నారు.

సిబ్బందిని అభినందించిన ఎస్పీ

నిందితులను అరెస్ట్ చేసి చోరీ సొత్తు రాబట్టడంలో కృషి చేసిన నగర డీఎస్పీ, వేదాయపాళెం ఇన్‌స్పెక్టర్, ఎస్సై శ్రీనివాసరావు, ఏఎస్సై ప్రసాద్, హెచ్‌సీ సుబ్బారావు, పీసీలు గోపాలయ్య, నాగరాజు, గురుమహేష్, చంద్రవర్ధన్, బాలాజీనగర్ హెచ్‌సీ సుధాకర్, కానిస్టేబుళ్లు తిరుపతి, శ్రీహరిని ఎస్పీ అభినందించి ప్రశంసపత్రాలు, రివార్డులను అందజేశారు. ఏఎస్పీ సౌజన్య తదితరులు పాల్గొన్నారు.

బైక్ దొంగల అరెస్ట్

- 15 వాహనాలు స్వాధీనం



స్వాధీనం చేసుకున్న బైక్‌లతో పోలీస్ అధికారులు

నెల్లూరు(క్రైమ్): సులభమార్గంలో డబ్బులు సంపాదించేందుకు బైక్ దొంగతనాలకు పాల్పడుతున్న ఇద్దరు నిందితులను దర్గామిట్ట పోలీసులు మంగళవారం అరెస్ట్ చేశారు. నగరంలోని ఉమేష్‌చంద్ర కాన్ఫరెన్స్ హాల్లో నిర్వహించిన సమావేశంలో నిందితుల వివరాలను ఎస్పీ కృష్ణకాంత్ వెల్లడించారు. ప్రకాశం జిల్లా కొత్తపట్నానికి చెందిన శివరామకృష్ణారెడ్డి, భక్తవత్సలనగర్‌కు చెందిన శ్రావణ్‌కుమార్ జల్సాలకు అలవాటుపడి సులభమార్గంలో డబ్బులు సంపాదించేందుకు బైక్ దొంగలుగా అవతారమెత్తారు. నగరంతో పాటు ఒంగోలులో బైక్‌లను మారుతాళాలతో దొంగలించి వాటిని విక్రయించగా, వచ్చిన సొమ్ముతో జల్సాగా జీవించసాగారు. ఈ క్రమంలో దర్గామిట్ట ఇన్‌స్పెక్టర్ రోశయ్య తన సిబ్బందితో ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేసి గాలింపు చర్యలు చేపట్టారు. ఈ తరుణంలో శబరి శ్రీరామ క్షేత్ర సమీపంలో నిందితులు అనుమానాస్పదంగా తిరుగుతుండగా ప్రత్యేక బృందం అదుపులోకి తీసుకొని స్టేషన్‌కు తరలించారు. అనంతరం వారిని తమదైన శైలిలో విచారించగా, దర్గామిట్ట పరిధిలో మూడు, చిన్నబజార్ పరిధిలో ఆరు, వేదాయపాళెంలో ఒకటి, బాలాజీనగర్ పరిధిలో రెండు, ఒంగోలు ఒకటో పట్టణ పోలీస్‌స్టేషన్ పరిధిలో మూడు బైక్‌లను చోరీ చేశామని అంగీకరించడంతో నిందితులను అరెస్ట్ చేశారు. వీరి నుంచి రూ 5.95 లక్షల విలువజేసే 15 బైక్‌లను స్వాధీనం చేసుకున్నారు. నిందితులను అరెస్ట్ చేసి చోరీ సొత్తు రాబట్టడంలో కృషి చేసిన దర్గామిట్ట ఇన్‌స్పెక్టర్, ఎస్సై రమేష్‌బాబు, సిబ్బందిని ఎస్పీ అభినందించి ప్రోత్సాహకాలను అందజేశారు. ఏఎస్పీ సౌజన్య, నగర డీఎస్పీ శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నిమ్మ ధరలు (కిలో)

పెద్దవి : రూ.95
సన్నవి : రూ.60
పండ్లు : రూ.40

ఎస్సైల బదిలీ

నెల్లూరు(క్రైమ్): జిల్లాలోని వివిధ పోలీస్‌స్టేషన్ల ఎస్సైలను బదిలీ చేయడంతో పాటు వీఆర్‌లో ఉన్న వారికి పోస్టింగ్‌లు కల్పిస్తూ ఎస్పీ కృష్ణకాంత్ ఉత్తర్వులను మంగళవారం జారీ చేశారు. వీరు తమకు కేటాయించిన ప్రాంతాల్లో విధుల్లో వెంటనే చేరాలని ఆదేశించారు.

పేరు	ప్రస్తుతం	బదిలీ అయిన పీఎస్
రాకేష్	వీఆర్	మనుబోలు
రమేష్‌బాబు	దర్గామిట్ట	సంతపేట
బాలకృష్ణ	ఎస్‌ఈబీ	సంతపేట
వెంకటేశ్వర్లు	డీసీఆర్బీ	నెల్లూరు రూరల్
లక్ష్మణ్‌రావు	గుడ్లూరు	నెల్లూరు రూరల్
మహమ్మద్ సుభానీ	బాలాజీనగర్	లింగసముద్రం
బాజీబాబు	లింగసముద్రం	వీఆర్
అనూష	సీతారామపురం	సోమశిల
సుబ్బారావు	సోమశిల	వీఆర్
శ్రీనివాసరావు	వీఆర్	మర్రిపాడు

అవినీతిని నిరూపిస్తే ఏ శిక్షకైనా సిద్ధం



మాట్లాడుతున్న బాలసుబ్రహ్మణ్యం

మనుబోలు(వెంకటాచలం): భక్తి విశ్వాసంతో గొలగమూడిలోని వెంకయ్యస్వామి ఆలయాభివృద్ధికి 18 ఏళ్లుగా కృషి చేస్తున్నానని, తన హయాంలో ఒక్క రూపాయి అవినీతి జరిగిందని నిరూపిస్తే ఏ శిక్షకైనా సిద్ధమని ఈఓ బాలసుబ్రహ్మణ్యం పేర్కొన్నారు. ఆలయం వద్ద విలేకరుల సమావేశంలో మంగళవారం ఆయన మాట్లాడారు. రూపాయి జీతం సైతం తీసుకోకుండా ఈఓగా విధులు నిర్వర్తిస్తున్నానని, గొలగమూడిని షిర్డీ తరహాలో అభివృద్ధి చేయాలనే సంకల్పంతో పాటుపడుతున్నానని చెప్పారు. హైకోర్టు ఆదేశాల మేరకే ఆలయ కమిటీ పనిచేస్తోందని తెలిపారు. తాను బాధ్యతలు చేపట్టే నాటికి రూ.ఏడు కోట్లు ఉన్న ఆలయ ఆస్తులు ప్రస్తుతం రూ.200 కోట్లకు పెరిగాయన్నారు. ఆలయంలో ఉత్సవాలకు విచ్చేసే వెంకయ్యస్వామి కుటుంబసభ్యులకు మర్యాదపూర్వకంగా దర్శన ఏర్పాట్లు చేశామని చెప్పారు. తనపై, ఆలయంలో ఏర్పాట్లపై వారు చేస్తున్న ఆరోపణలు అవాస్తవమని, స్వామి వారి వారసులుగా ఎవరికీ హక్కును న్యాయస్థానాలు కల్పించలేదని గుర్తుచేశారు. వెంకయ్యస్వామి కుటుంబసభ్యులకు.. ఆశ్రమ యాజమాన్యానికి ఎలాంటి సంబంధం లేదని స్పష్టం చేశారు. గొలగమూడి ఆశ్రమ పర్యవేక్షణ పూర్తిగా హైకోర్టు నియమించిన కమిటీ ద్వారానే జరుగుతుందని, ఇతరులకు ఎలాంటి సంబంధంలేదని పేర్కొన్నారు.

తైక్వాండో జట్ల ఎంపిక

కందుకూరు రూరల్: జిల్లా స్థాయి తైక్వాండో సీనియర్ బాలబాలికల ఎంపికలు, ఖేలో ఇండియా తైక్వాండో పోటీలను స్థానిక టీఆర్‌ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల క్రీడా మైదానంలో మంగళవారం నిర్వహించారు. ఆంధ్రప్రదేశ్ తైక్వాండో వైస్ ప్రెసిడెంట్, మాస్టర్ అబ్దుల్ సలామ్ పర్యవేక్షణలో నిర్వహించిన పోటీలకు 50 మంది క్రీడాకారులు హాజరయ్యారు. ఎంపికైన క్రీడాకారులు తిరుపతిలోని సంస్కృత సెంట్రల్ యూనివర్సిటీలో ఈ నెల 31 నుంచి సెప్టెంబర్ ఒకటి వరకు నిర్వహించనున్న రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొననున్నారని జిల్లా కార్యదర్శి అఖిల్ తెలిపారు.

- బాలికల విభాగంలో భవ్యశ్రీ, హర్షిణి, అస్మిత హర్షల్, తాహెరా, మెరీస్టెల్లా, శైలజ, జానకి, హాసిని రెడ్డి, సిరి చందన, లక్ష్మీప్రియ, స్నేహ, ఫమీదా ఎంపికయ్యారు.
- బాలుర విభాగంలో వరుణ్, మసూద్, రాకేష్ రోషన్, మహమూద్, భాస్కర్‌రెడ్డి ఎంపికయ్యారు. వీరిని జిల్లా అధ్యక్షుడు వల్లభుని మనీషా ముఖేష్ తదితరులు అభినందించారు. జిల్లా కార్యవర్గ సభ్యులు ముఖేష్‌కుమార్, శ్రీను, చరణ్, సాగర్, సుమంత్ పాల్గొన్నారు.

పౌల్ట్రీ అసోసియేషన్ ధరలు

బ్రాయిలర్ (లైవ్)	: 108
లేయర్ (లైవ్)	: 105
బ్రాయిలర్ చికెన్	: 200
బ్రాయిలర్ స్కిన్‌లెస్	: 220
లేయర్ చికెన్	: 178

రెవెన్యూ సమస్యలపై దృష్టి సారించండి

- కలెక్టర్ ఆనంద్



వీడియో కాన్ఫరెన్స్‌ను నిర్వహిస్తున్న ఆనంద్

నెల్లూరు(దర్గామిట్ట): జిల్లాలో పెండింగ్‌లో ఉన్న రెవెన్యూ సమస్యలపై ప్రత్యేక దృష్టి సారించి పరిష్కారానికి కృషి చేయాలని కలెక్టర్ ఆనంద్ ఆదేశించారు. రెవెన్యూ ఇంటిగ్రేటెడ్ సర్టిఫికెట్లు, మ్యుటేషన్లు, గ్రామాల్లో పారిశుధ్య కార్యక్రమాలు తదితర అంశాలపై సబ్ కలెక్టర్, ఆర్డీఓలు, మున్సిపల్ కమిషనర్లు, ఎంపీడీఓలు, తహసీల్దార్లతో వీడియో కాన్ఫరెన్స్‌ను మంగళవారం నిర్వహించారు. కలెక్టరేట్లోని శంకరన్ హాల్ నుంచి నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఇంటిగ్రేటెడ్ సర్టిఫికెట్ల మంజూరు, మ్యుటేషన్లపై తహసీల్దార్లు ప్రత్యేక దృష్టి సారించాలని, ఎలాంటి కారణాల్లేకుండా దరఖాస్తులను తిరస్కరించొద్దని సూచించారు. రీ ఓపెనైన అర్జీలను నిశితంగా పరిశీలించి అవసరమైన సందర్భాల్లో ఆయా అర్జీదారులతో వ్యక్తిగతంగా మాట్లాడి పరిష్కారానికి కృషి చేయాలని కోరారు. పంచాయతీల్లో ట్యాంకులను శుభ్రపర్చడం, జంగిల్ క్లియరెన్స్, చెత్త సేకరణ కార్యక్రమాలపై నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని స్పష్టం చేశారు. ఎలాంటి ఆధారాల్లేకుండా ఉన్న ఎస్టీలకు జనన ధ్రువీకరణ పత్రాలు, ఆధార్ కార్డులను మంజూరు చేయాలని ఆదేశించారు. ఎన్టీఆర్ భరోసా పింఛన్లను గత నెల ఒకటో తేదీనే 95 శాతానికిపైగా పంపిణీ చేశారని, ఇదే తరహాలో రానున్న నెల్లో అందజేసేలా చర్యలు చేపట్టాలని సూచించారు. ఉపాధి పనిదినాలను పెంచాలని, హౌసింగ్ పథకంలో ఉపాధిని చేపడితే రెండు విధాలా లబ్ధి చేకూరుతుందని వివరించారు. అన్ని పాఠశాలల్లో ఆర్వో ప్లాంట్లు పనిచేసేలా చర్యలు చేపట్టాలని చెప్పారు. జేసీ కార్తీక్, జెడ్పీ సీఈఓ కన్నమనాయుడు, డ్వామా పీడీ శ్రీనివాసులు, డీఈఓ రామారావు, సమగ్ర శిక్ష ఏపీసీ ఉషారాణి, డీపీఓ సుస్మిత, హౌసింగ్ పీడీ దయాకర్, ఐటీడీఏ పీఓ పరిమళ తదితరులు పాల్గొన్నారు.

మా వారే టెండర్లు వేయాలి

- టీడీపీ చోటా నేతల బెదిరింపు

నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట): ఇరిగేషన్‌లో కాంట్రాక్ట్ పనులకు సంబంధించిన టెండర్లను తామే వేయాలంటూ మిగిలిన కాంట్రాక్టర్లను టీడీపీ నేతలు బెదిరించారు. ఈ ఘటనకు నెల్లూరు సెంట్రల్ డివిజన్ మంగళవారం వేదికై ంది. వివరాలు.. జిల్లాలోని పెన్నా, సంగం బ్యారేజీ, పొదలకూరు మండలంలోని సూరాయపాళెంలో పూడికతీత పనులకు టెండర్లను ఇరిగేషన్ శాఖ ఆహ్వానించింది. దీనికి సంబంధించిన గడువు మంగళవారం సాయంత్రం ఐదు గంటలతో ముగియనుండటంతో రామలింగాపురంలోని కార్యాలయం వద్దకు టెండర్లు వేసేందుకు కాంట్రాక్టర్లు వచ్చారు. అయితే జిల్లాకు చెందిన మంత్రుల సూచనల మేరకు తమ వారే టెండర్లు వేయాలంటూ కొందరు టీడీపీ చోటా నేతలు బెదిరించారని కాంట్రాక్టర్లు తెలిపారు. ప్రస్తుత పరిస్థితుల్లో అధికార పార్టీకి చెందిన వారితో గొడవలు అనవసరమని భావించిన కాంట్రాక్టర్లు టెండర్లు వేయకుండానే వెనుదిరిగారు. కాగా ఈ విషయమై సెంట్రల్ డివిజన్ ఈఈ నాగరాజును సంప్రదించగా, మొత్తం 27 టెండర్లు వచ్చాయని, స్క్రూటినీ అనంతరం ఎం ప్యానల్‌కు పంపుతామన్నారు. టెండర్లలో తమ ప్రమేయమేమీ ఉండదని తెలిపారు. టెండర్లు వేసేందుకు వచ్చిన వారిని కొందరు బలవంతంగా వెనక్కి పంపారనే అంశాన్ని ప్రస్తావించగా, తనకు తెలియదని బదులిచ్చారు.

వైద్య కార్యాలయంలో దొంగల కలకలం

నెల్లూరు(అర్బన్): సంతపేటలోని జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ కార్యాలయంలో మంగళవారం దొంగలు పడ్డారు. తలుపు తాళాలను పగలగొట్టారు. విలేజ్ హెల్త్ క్లినిక్‌లకు సరఫరా చేయాల్సిన సెలైన్ స్టాండ్లు, కొన్ని రకాల పరికరాలు, కంప్యూటర్లను ఎత్తుకెళ్లారని ఉద్యోగులు పేర్కొంటున్నారు. ఈ విషయమై డీఎంహెచ్‌ఓ పెంచలయ్యను సంప్రదించగా, తాళాలు పగలగొట్టే శబ్దంతో వాచ్‌మెన్ వచ్చారని, దీంతో దొంగలు పరారయ్యారని చెప్పారు. వస్తువుల లెక్కలు పోల్చి చూశామని, ఏ పరికరాలు చోరీకి గురికాలేదని తెలిపారు. కాగా వైద్యశాఖ ఉద్యోగులు మాత్రం ఇదంతా వట్టిదేనని, కొన్ని రకాల వస్తువులు దొంగలపాలయ్యాయని చర్చించుకోవడం గమనార్హం.

కారు బోల్తా

- నలుగురికి గాయాలు



బిట్రగుంట: కారు అదుపుతప్పి బోల్తాపడిన ఘటన బోగోలు మండలం ముంగమూరు సమీపంలో మంగళవారం చోటుచేసుకుంది. ఘటనలో నలుగురు టెలికామ్ ఉద్యోగులు గాయపడగా, వీరిలో ఒకరి పరిస్థితి విషమంగా ఉంది. పోలీసులు, స్థానికుల కథనం మేరకు.. ముంగమూరులోని బీఎస్‌ఎన్‌ఎల్ టవర్‌లో సాంకేతిక సమస్యలు తలెత్తడంతో సిబ్బంది మూడు రోజులుగా మరమ్మతులు చేస్తున్నారు. ఈ క్రమంలో వీటిని పూర్తి చేసేందుకు బీఎస్‌ఎన్‌ఎల్ సబ్ డివిజనల్ ఇంజినీర్ దువ్వూరు హరికృష్ణ, మరో ఇద్దరు టెక్నీషియన్లు కారులో ముంగమూరు బయల్దేరారు. ఈ క్రమంలో గ్రామానికి సమీపంలోని కల్వర్టు వద్ద అదుపుతప్పి బోల్తా పడింది. ప్రమాదంలో సబ్ డివిజనల్ ఇంజినీర్ హరికృష్ణ, డ్రైవర్ నాగరాజు, టెక్నీషియన్లు జాషువా, రంగయ్య గాయపడ్డారు. హరికృష్ణ పరిస్థితి విషమంగా ఉండటంతో, మెరుగైన వైద్యం నిమిత్తం చెన్నై తరలించారు. మిగిలిన వారు కావలి ఏరియా వైద్యశాలలో చికిత్స పొందుతున్నారు. ఈ మేరకు బిట్రగుంట పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.